క్లుప్తంగా

ప్రతిభ భళా



టెన్నికాయిట్ క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: పట్టణంలోని నారాయణ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు పూజిత, యామిని, సుమంత్‌శ్రీ రామ్‌లను మంగళవారం స్కూల్‌లో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఈనెల 6న కర్నూలులోని ఒరియంటల్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఈనెల 10, 11వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఇనామ్ భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న ఈఓ, ఏఈఓ

మహానంది: నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలోని మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, సిబ్బంది పరిశీలించారు. మంగళవారం కొత్తపల్లె గ్రామానికి చేరుకుని 36 ఎకరాల ఇనామ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ మహానందీశ్వరస్వామి దేవస్థాన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

కుమారస్వామికి విశేషపూజలు



పూజలందుకున్న కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని

మహానంది: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని సూచించారు. తిమ్మాపురం, గాజులపల్లె గ్రామాల్లోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వైద్యులతో మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చేవారిలో అధిక శాతం పేదలే ఉంటారని, వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజారోగ్యం కోసం పాటుపడాలన్నారు. తిమ్మాపురం పీహెచ్‌సీలో ఓ బాలింతకు తన వంతుగా రూ. 2 వేల సాయం అందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భజన గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళా వేదికపై అనంతపురం జిల్లా, యాడికికి చెందిన సీతారామాంజనేయ భజన బందం వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. వినాయక ప్రార్థన, ఓం నమః శివాయ, మహేశ పాపవినాశా, శివ శివశంకరా, నమశ్శివాయ, ఓంకార రూపిణి మొదలైన భజనగీతాలను రామిరెడ్డి, అశ్వర్థరెడ్డి, కంబగిరిరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఈశ్వరరెడ్డి, నాగరాజు, నాగభూషణ్ రెడ్డి, వెంకటనారాయణ, సువర్ణ, రమణమ్మ, వరలక్ష్మి లక్ష్మీనారాయణమ్మ, వేదవతి తదితరులు ఆలపించారు.

క్రీడాదుస్తుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 17, 18, 19 తేదీల్లో మదనపల్లెలో జరిగే సబ్‌జూనియర్ హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేసినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, నంద్యాల జాయింట్ సెక్రటరీ దివాకర్, కెనడీ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ హాకీ పోటీలకు ఎంపికైన 18 మంది క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ నాయకులు మాణిక్యరాజు, విల్సన్, శ్రావణ్, శివ పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్



దివ్యాంగుడిని పరిశీలిస్తున్న తనిఖీ బృందం

జూపాడుబంగ్లా: హెల్త్ పింఛన్‌పై మంగళవారం అధికారుల బృందం విచారణ చేయటంతో తమ పింఛన్ ఉంచుతారా..తొలగిస్తారా అంటూ లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది. అనంతపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చెందిన డాక్టర్ పవన్, స్థానిక ప్రాథమిక వైద్యుడు గంగాధర్, ఆత్మకూరు మున్సిపల్ వార్డు సెక్రటరీ, సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బంది టీంగా హెల్త్ పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి స్థితిని, సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. నిజంగా వారు మంచానికి పరిమితం అయ్యారా.. నడవలేకపోతున్నారా అనే విషయాలను గుర్తిస్తున్నారు. తమ పరిశీలనలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని 10 గ్రామాల పరిధిలో హెల్త్ పింఛన్ కింద నెలకు రూ.15 వేలు పొందుతున్న లబ్ధిదారులు 25 మంది ఉన్నారు. తనిఖీబృందం 80 బన్నూరు, తాటిపాడు, జూపాడుబంగ్లాలో పరిశీలించారు. పింఛన్ల తనిఖీని ఎంపీడీఓ గోపికృష్ణ పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, ఏఎన్‌ఎంలు కరుణ, సచివాలయ ఉద్యోగులు విజయశేఖర్‌గౌడు, పీఎస్ చంద్రశేఖర్, మహిళా పీఎస్ హర్షిత పాల్గొన్నారు.

విశాఖ పర్యటన సిగ్గు..సిగ్గు



పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేసున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా నరేంద్రమోదీ విశాఖ పర్యటనకు రావడం సిగ్గు చేటని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పటేల్ సెంటర్‌లో మోదీ విశాఖ పర్యటనను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల ప్రత్యేక హోదా, రాయలసీమకు వెనుకబడిన రాయలసీమ జిల్లాలు, ఉత్తరాంధ్ర ఏడు జిల్లాలకు ఏటా జిల్లాకు రూ.50 కోట్లు కేటాయిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోదీ మోసం చేయడం దారుణమన్నారు. 2014 ఎన్నికల ముందు అమరావతి, తిరుపతి సభల్లో చంద్రబాబుతోపాటు మోదీ ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పక్కిర్‌సాహెబ్, కర్ణ, మారెన్న, ఉస్మాన్ బాషా, సలాంఖాన్, రంగమ్మ, హుసేన్, షాజిదాబీ, జయరాణి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మధు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
13వ తేదీకి వాయిదా

ఆత్మకూరు: కర్నూలు జిల్లా కేంద్రంలోని యాదవ హాస్టల్‌లో ఈనెల 12న నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 13వ తేదీకి వాయిదా వేసినట్లు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పోలకల్ నాగేశ్వరరావు, యనగండ్ల శ్రీనివాసులు, చెన్నుపాడు రామకృష్ణ, గుమ్మడాపురం శ్రీనివాసులు, నాగరాజు మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యాదవ హాస్టల్ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించిన లక్ష్మణదాస్ సతీమణి, భూదాత సావిత్రమ్మ ఇటీవల మరణించారని, ఆమె సంతాప సభ 12న ఉండటంతో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అదే రోజు నిర్వహించుకోవడం భావ్యం కాదని భావించి మరుసటి రోజుకు వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థులు, యాదవ సంఘం నాయకులు గమనించాలని కోరారు.

11న ముగ్గుల పోటీలు

మహానంది: అబ్బీపురం గ్రామంలోని గిరిజన కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 11న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సీపీఐ మండల కార్యదర్శి సామేలు మంగళవారం తెలిపారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వండి

● నంద్యాల ఎల్‌డీఎం రవీంద్ర



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న అధికారులు

వెలుగోడు: స్థానిక స్టేట్ బ్యాంకు, ఏపీజీబీ, కెనరా, కేడీసీసీ బ్యాంకు మేనేజర్‌లను మంగళవారం కలిసి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ నంద్యాల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పంట రుణం పొందని కౌలు రైతులు వెంటనే సేవింగ్ ఖాతా ఉన్న సంబంధిత బ్యాంక్‌ల్లో అప్లికేషన్ అందించి పంట రుణాలు పొందాలని రైతులను కోరారు. ఈనెల 8, 9వ తేదీలలో అన్ని గ్రామాల్లో కౌలు పంట రుణాల కోసం సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు సదస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. కౌలు రైతులు తమ ఆధార్ సీసీఆర్సీ–కౌలు గుర్తింపు కార్డు తీసుకొని సదస్సులో పాల్గొన్న బ్యాంకు కరెస్పాండెంట్‌కి అందజేయాలన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు.

విలువలకు నిదర్శనం శ్రీమద్రామాయణం




మానవీయ విలువలను తెలియజేస్తున్న ఆమంచి వెంకటేశ్వర్లు

జూపాడుబంగ్లా: మానవీయ విలువలకు నిలువెత్తు నిదర్శనం శ్రీమద్రామాయణమని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచార్యులు ఆమంచి వెంకటేశ్వర్లు, హిందూధర్మ పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పారుమంచాల గ్రామంలోని రామాలయంలో నాలుగురోజుల ధార్మికకార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీమద్రామామాయణం యావత్‌సృష్టి ఉన్నంత వరకు మానవులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఓ పర్యాయం రామాయణం పఠిస్తే చాలు మానవులు ఎలా నడుచుకోవాలి, ఎలాంటి అలవాట్లు, కట్టుబాట్లు కలిగి ఉండాలనే విషయాలు అర్థమవుతాయన్నారు. భారతదేశం మొదటి నుంచి హిందుత్వదేశం కనుక సమాజంలోని ప్రతి ఒక్కరూ సనాతన హిందూధర్మ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలన్నారు. మానవీయవిలువలను కలిగి సత్ప్రవర్తనతో సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పాలరాముడు, పి.శివారెడ్డి, లోకేశ్వరరెడ్డి, జనార్దనరెడ్డి, ధర్మప్రచార మండలి సభ్యులు రామచంద్రుడు, పాపయ్య ఆచారి, చెన్నప్ప, వెంకటస్వామి, హరి, నాయుడు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

● డీఈఓ జనార్దన్‌రెడ్డి



యర్రగుంట్లలో పదవ తరగతి విద్యార్థుల స్టడీ క్లాస్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

శిరివెళ్ల: ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని డీఈఓ జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను తనిఖీ చేశారు. ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు చేరుకుని విద్యార్థులు, టీచర్లతో మాట్లాడారు. వంద రోజుల ప్రణాళికపై ఆరా తీశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని టీచర్లకు సూచించారు. అనంతరం వంట గది, బాతు రూంలను పరిశీలించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్‌స్కూల్‌లో మంగళవారం పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్ నాగేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు మహబూబ్ పీరా, చంద్రశేఖరయ్య, శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో క్యాలెండర్‌తోపాటు డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా అన్ని జీఓలు పొందుపరచి పక్కాగా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఎంఈఓలు అనురాధ, వీరప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలో కార్తికేయ ఏజెన్సీ కింద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈపీఎఫ్ అందరికీ వర్తింపచేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. మంగళవారం దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావును కలసి వినతి పత్రం అందజేశారు. చెంచు గిరిజన యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. మహాశివరాత్రి సందర్భంగా కాలినడక వచ్చే భక్తులకు మఠం భావి, ఇతర అటవీ ప్రాంతాల్లో తాగునీరు, వైద్యం, తినుబండారాలు అందుబాటు ఉండేలా చూడాలని, ఎమర్జెన్సీ వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి



సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న రైతులు

జూపాడుబంగ్లా: పొలాల్లో బోర్లు తవ్వుకొని రెండేళ్లవుతున్నా బోర్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయకపోవటంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని తంగడంచ, జూపాడుబంగ్లా, పారుమంచాల, తర్తూరు, మండ్లెం తదితర గ్రామాల రైతులు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను కలిసి విన్నవించారు. వ్యవసాయ బోర్లు, బావులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

సిబ్బందికి శిక్షణ

నందికొట్కూరు: విత్తన ఉత్పత్తి పథకం కింద రైతులకు అందజేసిన వరి పంట బీపీటీ 5204 రకం విత్తనంపై రైతు సేవ కేంద్రం సిబ్బందికి మంగళవారం ఆత్మ భవనంలో వ్యవసాయ టెక్నికల్ అధికారి కలిమున్నీసా శిక్షణ ఇచ్చారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కింద ఆ రకం వరి పంట విత్తనం రైతులకు ఇచ్చారు. రైతులు దిగుబడి సాధించే దిశగా సలహాలు, సూచనలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శిక్షణలో ఏడీఏ విజయశేఖర్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డు మంజూరు చేయండి

జూపాడుబంగ్లా: దరఖాస్తు చేసుకున్న కూలీలకు వెంటనే జాబ్‌కార్డు మంజూరు చేయాలని ఏపీడీ అన్వరాభేగం, ఎంపీడీఓ గోపికృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో జాబ్‌కార్డుకు వందరోజుల పనిదినాలు కల్పిస్తున్నందున జాబ్‌కార్డులో ఇద్దరి కంటే ఎక్కువ మంది సభ్యులున్నట్లయితే వారిలో వివాహితులైన వారుంటే రెండు, మూడు కుటుంబాలుగా విభజించి వేర్వేరు జాబ్‌కార్డులు మంజూరు చేయవచ్చన్నారు. వివాహం కాని ఒంటరి మహిళలు, పురుషులు ఉన్నట్లయితే వారికి వేర్వేరుగా జాబ్‌కార్డులు మంజూరు చేయవచ్చన్నారు. జాబ్‌కార్డుల్లోంచి స్ప్లిట్ కాదలచిన వారికి ప్రత్యేక రేషన్‌కార్డు లేకపోయినా వేరుగా జాబ్‌కార్డు ఇవ్వవచ్చన్నారు. సమావేశంలో ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

మహానంది: ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న డమాల పాములేటి(72) కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన పాములేటి నంద్యాలకు వెళ్లి పనులు ముగించుకుని స్కూటర్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో బుక్కాపురం సమీపంలోని చెరువు వద్ద సోమవారం ఓ ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు

ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

ఆళ్లగడ్డ: ప్రస్తుత ఆహారపు అలవాట్లను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి శైలజ సూచించారు. మంగళవారం పట్టణంలోని మేజిస్ట్రేటు కోర్టు భవన సదుపాయం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది, అడ్వకేట్‌లకు కర్నూలు కిమ్స్ వైద్యశాల గుండెనిపుణులు ప్రవీణ్ ఉచితంగా వైద్య చికిత్సలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలకోసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. గుండెజబ్బులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకొని శారీరక శ్రమ తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం ఉచితంగా బీపీ, షుగర్‌తోపాటు ఈసీజీ, అవసరం అయిన వారికి ఏకో2డీ పరీక్షలు నిర్వహించారు. రిటైర్డ్ జడ్జీలు కాశీభట్ల శివప్రసాద్, శివనాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు శివరామిరెడ్డి, నీలకంఠం, శ్రీనాథ్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రభాకర్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బండిఆత్మకూరు: మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజులు కోరారు. ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికుల సమస్యల పరిష్కారంపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యార్థులకు రుచికరమైన వంటలు వడ్డిస్తూ తక్కువ వేతనంతో సేవలు అందిస్తున్న కార్మికులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయి నాయకులు తమ వర్గం వారికే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పించుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. బండిఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామం హైస్కూల్‌లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులపై ఎలాంటి ఫిర్యాదు లేకున్నా దిగిపోవాలంటూ నాయకులు బెదిరించడం తగదన్నారు. నోటీసులు ఇవ్వకుండా అధికారులు రాత్రికి రాత్రే కార్మికులను తొలగించడం దుర్మార్గమని, ఇటువంటి ప్రయత్నాలు విరమించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మోడల్ స్కూల్‌లో విద్యాకమిటీ చైర్మన్ రాజకీయాలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, శంకరమ్మ, జమ్ముత్, సుశీలమ్మ, రమిజాబీ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ విడుదల



క్యాలెండర్, డైరీలను విడుదల చేస్తున్న ఎంఈఓలు, ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఎంఈఓలు బాలాజీనాయక్, సురేష్ చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులందరికీ మంచి జరగాలని, అలాగే ఉపాధ్యాయులందరూ విద్యార్థుల ప్రగతి కోసం పాటుపడాలని కోరారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నారన్నారు. ఈ పోరాటాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, జిల్లా సహాయధ్యక్షులు ఎం.ఎస్.ఉమ్మర్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కాలేజ్ ఆడిటోరియంలో జరిగే కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు అబ్దుల్ వహీద్, కృష్ణుడు, జిల్లా నాయకులు విధుభూషణ్, భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించుకోండి



రైతుల వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

కొత్తపల్లి: రైతుల గ్రామ సభల ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 8 మంది రైతుల నుంచి భూమి కొలతలు, 6 గురు రైతులు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు కోసం వినతులు ఇచ్చారన్నారు. వాటిని విచారించి త్వరలోనే పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనూషరాణి, వీఆర్వోలు బాబుమియా, వేణుగోపాలు, రామసుబ్బయ్య, అశోక్, గ్రామ సర్వేయర్ అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

కృష్ణాపురంలో..

ఆత్మకూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 6 అర్జీలు అందాయని, విచారణ చేసి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, సర్వేయర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

నందికొట్కూరు: అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు కనీస వేతనం మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాణి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళా కార్మికులకు కనీస వేతనం అందడం లేదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నాలో నాయకులు వెంకటరమణ, కమల, కాత్యాయని పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ విజయశేఖర్

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలను ఈపంట నమోదు చేయించుకోవాలని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో ‹పొలంపిలుస్తోంది› కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ, ఏఓ మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవటం వల్ల అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంటనష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. వరి పంటకు ఈనెల 15తేదీ వరకు ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చునన్నారు. అలాగే రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలను ఈపంట నమోదు చేయించుకొని ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన కందిపంట నూర్పిడి చేసుకొన్న రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,550లకు కందులు విక్రయించుకొనేందుకుగాను రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం రబీలోసాగుచేసిన కందిపంటసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు.

– కొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలోని పంట పొలాల్లో ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది పంటలో సస్యరక్షణ పద్ధతుల ద్వారా పురుగులను నివారించుకోవచ్చని, ఎండుతెగులు నివారణ కూడా చేసుకోవచ్చునన్నారు. దీని నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను మొదల్లు తడిచేవరకు పిచికారి చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌లో కందిపంటలను సాగుచేసుకున్న రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని సూచించారు.